9

సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

1 నుంచి పింఛన్ల పండగ

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మక్కువ: ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను దశలవారీగా రూ.3 వేలకు పెంచారని, జనవరి 1వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీని పండగలా నిర్వహిద్దామని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మక్కువ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వెల్ఫేర్ అసిస్టెంట్స్, సచివాలయ ఉద్యోగులతో సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో సుమారు 22 రకాల పింఛన్లను 66 లక్షల మందికి అందిస్తున్నట్టు వెల్లడించారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో పింఛన్ల పంపిణీ జరగడంలేదని తెలిపారు. మక్కువ ప్రధానరోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వంలో తను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నిధులు మంజూరు చేసినప్పటికీ, గత టీడీపీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. మక్కువ ప్రధాన రహదారి (డబుల్ రోడ్డు) నిర్మాణానికి రూ.56 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీలకు హెచ్‌డబ్ల్యూఓలుగా అవకాశం

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలో వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు గ్రేడ్-2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా అవకాశం కల్పించనున్నారు. అర్హులైన ఎస్‌జీటీలు వచ్చేనెల 5వ తేదీలోగా ట్రైబల్‌వెల్ఫేర్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ మంగవేణి శనివారం ఓ ప్రకటనలో కోరారు.

ఈవీఎంల పరిశీలన



ఈవీఎం గొడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: వచ్చే ఏడాది జరగనున్న సాధారణ ఎన్నికల్లో పారదర్శకంగా ఓటింగ్ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఈవీఎంల గొడౌన్‌ను ఆయన వివిధ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈవీఎంల భద్రతపై ఆరా తీశారు. ఈవీఎంలకు భద్రత కల్పించాలని పోలీసులకు సూచించారు. ఈవీఎంల పనితీరును పరిశీలించుకోవాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఆయన వెంట డీఆర్వో జె.వెంకటరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉల్లికాడలకు భలే గిరాకీ




రామభద్రపురం అంతరాష్ట్ర మార్కెట్లో ఉల్లి కాడలు తూకం వేస్తున్న వ్యాపారి

రామభద్రపురం:రామభద్రపురం అంతర రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో ఉల్లిగడ్డల కంటే ఉల్లికాడల ధర మూడింతలు ఎక్కువ పలుకుతోంది. గతంలో ఉల్లి రైతులు కాడలను తెంచి ఇరుగుపొరుగు వారికి పంచిపెట్టేవారు. లేదంటే పొలంలోనే వదిలేసేవారు. ఇప్పుడు అవే ఉల్లి కాడలు మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60 వరకు ధర పలుకుతోంది. రైతులకు కాసులు కురిపిస్తున్నాయి.

కొత్త జిల్లా... కొంగొత్త వెలుగులు

- కొద్ది రోజుల్లోనే అభివృద్ధి పథాన పార్వతీపురం మన్యం జిల్లా
- అన్ని రంగాల్లో త్వరితగతిన పురోగతికి ప్రభుత్వం కృషి
- జిల్లా చరిత్రలో 2023 సంవత్సరం ఓ మైలురాయి
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అద్భుత ప్రగతి
- వార్షిక నివేదికను వెల్లడించిన కలెక్టరు నిషాంత్‌కుమార్



సాక్షి ప్రతినిధి, విజయనగరం: పార్వతీపురం మన్యం జిల్లా... 2022 ఏప్రిల్ 4వ తేదీన ఆవిర్భవించిన ఓ కొత్త జిల్లా. అభివృద్ధి వికేంద్రీకరణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన జిల్లాల విభజన ప్రక్రియ ఫలితంగా ఆవిర్భవించిన ఓ పసిగుడ్డు! కానీ పెద్ద జిల్లాలను సైతం తలదన్నేలా అద్భుత ఫలితాలతో అబ్బురపరుస్తోంది. విజయనగరం జిల్లా నుంచి వేరుపడిన సాలూరు, పార్వతీపురం, కురుపాం అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం జిల్లా నుంచి వేరుపడి వచ్చిన పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గ ప్రాంతాన్ని కలుపుకుంటూ ఏర్పడిన జిల్లాలో ముఖ్యమంత్రి ఆశించిన ప్రయోజనాల వైపు తొలి అడుగు పడింది. ఎన్నో అభివృద్ధి ఫలాలను గిరిజన, సామాన్య ప్రజలకు అందించిన 2023 సంవత్సరం పార్వతీపురం మన్యం జిల్లా చరిత్రలో ఓ మైలురాయిగా కలెక్టరు నిషాంత్‌కుమార్ పేర్కొన్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం తదితర రంగాల్లో సాధించిన ప్రగతిని శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

'పదిహేను మండలాలతో 2022 సంవత్సరంలో ఏర్పాటైన పార్వతీపురం మన్యం జిల్లా బాలారిష్టాలన్నీ అధిగమించింది. 2023 సంవత్సరంలో మంచి ప్రగతి కనబరచింది. జిల్లాలో 1,67,053 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. 3,92,594 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. దీనిలో రైతులు, స్థానిక అవసరాలకు పోను 3,23,455 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుంది. ప్రభుత్వం 306 రైతుభరోసా కేంద్రాల పరిధిలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలతో ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగుతోంది. ఇప్పటివరకూ సుమారు రూ.133 కోట్ల విలువైన 1.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. గత ఏడాది ఇదే సమయానికి 83వేల మెట్రిక్ టన్నులే అయ్యింది. రైతులకు రెండు మూడు రోజుల వ్యవధిలోనే చెల్లింపులు జరుగుతున్నాయి. ఇప్పటివరకూ రూ.58 కోట్లు చెల్లించాం. మరో మూడు రోజుల్లో దాదాపు రూ.76 కోట్ల వరకూ చెల్లింపులు పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

త్వరితగతిన రోడ్ల నిర్మాణం...

పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమం, ఆర్‌అండ్‌బీ శాఖల పరిధిలో మొత్తం రూ.1259.68 కోట్లతో 1008 రహదారుల నిర్మాణ పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటికి అదనంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద ప్రతీ గిరిజన మండలానికి రూ.3 కోట్ల చొప్పున రూ.39 కోట్లు మంజూరయ్యాయి. ఇందుకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఎంతో చొరవ తీసుకున్నారు. ఇప్పటివరకూ 228 రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 198 రోడ్ల పనులు కొలిక్కి వస్తున్నాయి. మొత్తంమీద 2023 సంవత్సరంలో 430 కిలోమీటర్ల మేర రహదారి పనులు పూర్తి చేశాం.

పేదలకు తీరిన సొంతింటి కల...

పేదలకు సొంతింటి కల నెరవేరుతోంది. గృహ నిర్మాణ రంగంలో మంచి అభివృద్ధి సాధించిన పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలోనే నాలుగో స్థానంలో నిలిచింది. పేదలందరికీ ఇల్లు పథకం కింద 27,142 గృహాలు మంజూరయ్యాయి. 403 లేఅవుట్‌ల్లో 11,576 ఇళ్లు రాగా, సొంత స్థలాలున్న వారికి 15,566 ఇళ్లు వచ్చాయి. ఇంతవరకు 12.5వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. పీఎంఏవై-గ్రామీణ్ పథకంలో 7,306 ఇళ్లు మంజూరయ్యాయి. ఆ ఇళ్ల నిర్మాణ పనులన్నీ త్వరితగతిన జరుగుతున్నాయి.

44.73 కోట్లతో గడపగడపకు మన ప్రభుత్వం పనులు...

గడప గడపకు మన ప్రభుత్వం పథకం కింద రూ.44.73 కోట్లతో 1766 పనులు మంజూరు చేశాం. వాటిలో దాదాపు 400 పనులు పూర్తయ్యాయి. మిగతావన్నీ పురోగతిలో ఉన్నాయి. ఈ పనులకు రూ.12 కోట్లు చెల్లింపులు జరిగాయి.

ప్రతి గ్రామంలో ప్రాధాన్యత భవనాలు...

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రాధాన్యత భవనాల పనుల్లో 311 గ్రామ సచివాలయాల భవనాలకు గాను 125, అలాగే 301 ఆర్‌బీకేలకు గాను 100 భవనాలు పూర్తయ్యాయి. వైఎస్సార్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు (వెల్‌నెస్ సెంటర్‌లు) 192 మంజూరయ్యాయి. ఇప్పటివరకూ 15 పూర్తయ్యాయి. మిగిలనవన్నీ వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

2023 రివైండ్

సామాన్యులకు వైద్యం చేరువ...

ఒకప్పుడు వైద్యం సరిగాలేక అవస్థలు పడుతున్న గిరిజనులను చూసేవారం. ఇప్పుడు ప్రభుత్వం వైద్య రంగంలో చేపట్టిన సంస్కరణలతో అత్యధికంగా ప్రయోజనం పొందింది పార్వతీపురం మన్యం జిల్లానే. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది సహా ఆస్పత్రుల్లో ఖాళీల్లేకుండా పోస్టులన్నీ ప్రభుత్వం భర్తీ చేస్తోంది. 37 పీహెచ్‌సీలు, మూడు యూపీహెచ్‌సీలు, మూడు సీహెచ్‌సీలు, రెండు ఏరియా ఆస్పత్రులతో పాటు పార్వతీపురంలోని జిల్లా ఆస్పత్రిలో వసతులన్నీ మెరుగయ్యాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానం జిల్లాలో సమర్థంగా అమలవుతోంది. ఫలితంగా మాతా శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గింది. ప్రిజం-10 పేరుతో ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నాం. వ్యాక్సినేషన్ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటయ్యే సమయానికి మరణాల రేటు 28 ఉండగా ప్రస్తుతం 9 వరకు తగ్గింది. మాతృ మరణాలు 165 నుంచి 82కు తగ్గాయి. గతేదాది మాతృ మరణాలు 16 కాగా ప్రస్తుతం తొమ్మిదికి తగ్గాయి. వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పన పెద్దఎత్తున జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న ఉద్యాన కళాశాలకు సమీపంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి మట్టి పరీక్షలు జరిగాయి. డిజైన్ రూపకల్పన ప్రక్రియ తుది దశలో ఉంది. కురుపాం, భద్రగిరి, సీతంపేట, సామాజిక ఆస్పత్రుల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. సీతంపేటలో మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణం పనులు దాదాపుగా కొలిక్కి వస్తున్నాయి. పార్వతీపురంలో మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రి ఆధునీకరణ పనులు రూ.70 కోట్లతో జరుగుతున్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా సాగింది. 292 శిబిరాల్లో 1,29,191 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు. 3095 మందికి టీబీ పరీక్షలు, 6 లక్షల మందికి లెప్రసీ పరీక్షలు, 18,763 మందికి కంటి పరీక్షలు, మరో 39,371మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు.

మహిళలకు ఆర్థిక చేయూత

వైఎస్సార్ చేయూత నాలుగో విడతలో 77,995 మంది మహిళలకు రూ.146.39 కోట్లు మంజూరయ్యాయి. జనవరి 5వ తేదీ నుంచి పంపిణీ ప్రారంభమవుతుంది. వైఎస్సార్ ఆసరా పథకం కింద జనవరి 23 నుంచి 16,664 స్వయం సహాయక సంఘాలకు రూ.94.95 కోట్లు మేర ఆర్థిక సాయం అందిస్తాం. ఇవిగాక వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం మూడు దశల్లో 1700 మందికి రూ.11.84 కోట్లు మేర సాయం అందింది.

విద్యార్థులకు ఆర్థికంగా అండదండలు...

- జగనన్న విద్యాదీవెన పథకంలో 20,306 మంది విద్యార్థులకు రూ.23.42 కోట్లు, జగనన్న వసతి దీవెన పథకంలో 17,172 మందికి రూ.15.84 కోట్ల మేర ఆర్థికంగా అండదండలు లభించాయి. జగనన్న అమ్మ ఒడి పథకంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను 1,20,560 మంది విద్యార్థులకు సంబంధించి 83,733 మంది తల్లుల బ్యాంకు ఖాతాలకు రూ.125.60 కోట్ల మేర నేరుగా ప్రభుత్వం నుంచి సాయం చేరింది.
- జల్‌జీవన్ మిషన్ కింద జిల్లాలో 40 వేల గృహాలకు కుళాయిలు వేశాం. ఈ వారంలో 2వేల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాం.
- మారుమూల గిరిజన గ్రామాలకు ఇప్పుడు సెల్‌ఫోన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేశాం. జిల్లాలో 182 సెల్‌ఫోన్ టవర్లు మంజూరయ్యాయి. వాటిలో 73 టవర్లు అందుబాటులోకి వచ్చాయి. జనవరి నెలాఖరుకు మరో 47 టవర్లు సేవలందిస్తాయి. కమ్యూనికేషన్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులతో మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలు ప్రధాన జీవన స్రవంతితో అనుసంధానం అవుతున్నారు.
- పార్వతీపురం మన్యం జిల్లాలో 2,540 మంది లబ్ధిదారులకు 1947.40 ఎకరాల భూమి పంపిణీ జరిగింది. మరో 506 ఎకరాలను భూమిని 681మందికి ఇచ్చేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి.
- జిల్లాలో రీసర్వే పకడ్బందీగా చేస్తున్నాం. రీసర్వే ప్రారంభించిన 366 గ్రామాలకు గాను 291 గ్రామాల్లో పూర్తి అయ్యింది. సంబంధిత రైతులకు భూహక్కు పత్రాలు అందిస్తున్నాం.
- విద్యావ్యవస్థ మెరుగు పరిచేందుకు, పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా 'మై స్కూల్ మై ఫ్రెండ్' కార్యక్రమాన్ని చేపట్టాం. మంచి మార్కులు వచ్చేలా తర్ఫీదు ఇప్పిస్తున్నాం. ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

- డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



వార్షిక నివేదికను వెల్లడిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం - మన్యం జిల్లా వాసుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా వైద్యారోగ్యశాఖ పనిచేస్తోందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి. జగన్నాథరావు తెలిపారు. శనివారం స్థానిక వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో శాఖాపరమైన వార్షిక నివేదికను వెల్లడించారు. సమావేశంలో ఆర్‌బీఎస్‌కె ప్రాజెక్టు అధికారి డాక్టర్ దవళ భాస్కర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం. నారాయణరావు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వినోద్, డాక్టర్ జగన్ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

1,29,191 మందికి వైద్యసేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 292 క్యాంప్‌లు నిర్వహించి, 1,29,191 మందికి ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. వీరిలో 9,178 మంది బీపీ, 4,572 మంది సుగర్ వ్యాధిగ్రస్తులకు చికిత్సలు అందించారు. అలాగే కంటివెలుగు కార్యక్రమం ద్వారా జేఏఎస్‌లో మొత్తం 18,773 మందిని పరీక్షించి, 392 మందికి శస్త్రచికిత్సలు చేపట్టారు. 1229 మందికి కళ్లద్దాలు అందజేశారు.

1,71,179 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిని 25 లక్షల రూపాయలకు పెంచారు. జిల్లాకు ప్రస్తుతం 1,71,179 కార్డులు రాగా వాటిని పంపిణీ చేస్తున్నారు. త్వరలో మరో 80 వేల కార్డులు రానున్నాయి.

మాతా, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మాతా, శిశు ఆరోగ్యం పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 12,293 గర్భిణులను గుర్తించగా.. 9,767 మందికి ప్రసవం చేయించారు. గర్భిణులకు ప్రతి నెలా పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమం ద్వారా పూర్తి స్థాయి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు.

క్షయ, కుష్టి నిర్మూలన కార్యక్రమాలు

క్షయ, కుష్టి వ్యాధి నిర్మూలన కార్యక్రమాల కింద జేఏఎస్ ద్వారా 3,095 మందిని పరీక్షించి, 50 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించారు. వీరికి పౌష్టికాహారం నిమిత్తం ప్రతి నెలా 500 రూపాయలు అందజేస్తున్నారు. అలాగే 6,66,564 మందిని సర్వే చేసి 276 మందిలో లెప్రసీ లక్షణాలను గుర్తించారు.

మలేరియా, డెంగీ నిర్మూలనే లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా 2,60,553 మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా 482 మందికి మలేరియా, 230 డెంగీ జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. నివారణ చర్యల్లో భాగంగా 280 గ్రామాల్లో స్ప్రేయింగ్ చేపట్టడంతో పాటు 2,96,334 దోమతెరలు పంపిణీ చేశారు.

ప్రతి గ్రామానికి ఫ్యామిలీ డాక్టర్ సేవలు

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 29 వాహనాల ద్వారా 8748 వైద్యశిబిరాలు నిర్వహించారు.

విద్యార్థి దశలో క్రీడలు కీలకం

- పోటీల్లో పాల్గొనడమే ఓ విజయం
- ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాచిపెంట: విద్యార్థి దశలో క్రీడలు కీలకమైనవని, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడమే ఓ విజయంగా భావించాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తెలిపారు. మండలంలోని పి.కోనవలస గిరిజన గురుకుల విద్యాలయం క్రీడా మైదానంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన గిరిజన గురుకుల విద్యాలయాల అండర్-17,19 క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. 18 విభాగాల్లో జరిగిన పోటీల్లో రాష్ట్రంలోని 40 గిరిజన గురుకుల కళాశాలలు, 85 పాఠశాలల నుంచి సుమారు 1400 మంది క్రీడాకారులు తలపడ్డారు. ముగింపు కార్యక్రమంలో డీవీజీ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ మాట్లాడుతూ క్రీడలు మనసుకు ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యాన్నిస్తాయన్నారు. పట్టుదలతో బంగారు భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ పి.రఘువర్మ మాట్లాడుతూ యువత మంచి మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బడ్నాన ప్రమీల, సర్పంచ్ కె.మంగమ్మ, వైస్ ఎంపీపీ కె.రవీంద్రనాథ్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి డోలబాబ్జి, ప్రిన్సిపాల్స్ పి.శ్రీనివాసరావు, మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కౌన్సిలర్ వీరంగం

- కులదూషణ చేస్తూ అధికార పక్ష కౌన్సిలర్‌పై భౌతిక దాడి
- దీనికి నిరసనగా పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుడి తరఫున ఆందోళన
- కేసు నమోదు చేసిన పోలీసులు



మున్సిపల్ కార్యాలయంలో దళిత కౌన్సిలర్‌ను దూషిస్తున్న టీడీపీ కౌన్సిలర్ కోరాడ నారాయణరావు



పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రెల్లి సామాజిక వర్గీయులు

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ కోరాడ నారాయణరావు వీరంగం సృష్టించాడు. ప్రశాంతంగా జరుగుతున్న పార్వతీపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని రచ్చచేయాలన్న దురుద్దేశంతో గొడవకు దిగాడు. అధికారపక్ష కౌన్సిలర్, దళితుడైన నిమ్మకాయల సుధీర్‌ను కులంపేరుతో దూషించాడు. ఆయనపై దాడికి పాల్పడ్డాడు. దీంతో శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గందరగోళంగా మారింది. టీడీపీ కౌన్సిలర్లు సభదృష్టికి తెచ్చిన సమస్యలకు అధికార పక్ష సభ్యులు నిదానంగా సమాధానం చెబుతున్నారు. ఈ దశలో నారాయణరావు సహనం కోల్పోయాడు. అధికారంలేదన్న యావతో ఉగ్రరూపందాల్చాడు. తిట్లదండం అందుకున్నాడు. సభా మర్యాదలను పక్కనపెట్టి దూషించాడు. దీంతో దళిత కౌన్సిలర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నారాయణరావుపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసినట్టు సీఐ కృష్ణారావు తెలిపారు. టీడీపీ కౌన్సిలర్ ఇచ్చిన ఫిర్యాదుపైనా విచారణ చేస్తున్నామన్నారు.

చర్యలకు డిమాండ్

దళితులను కులంపేరుతో కించపరిచిన టీడీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని రెల్లి కులసంఘం సభ్యులు సొండి గోపి డిమాండ్ చేశారు. టీడీపీ కౌన్సిలర్, నాయకుల తీరుకు నిరసనగా పార్వతీపురం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. గతంలో ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు 'దళితులుగా పుట్టాలి అని ఎవరు కోరుకుంటారని' కించపరిచారని, ఇప్పుడు అదే తోవలో ఆ పార్టీ నాయకులు పయనిస్తున్నారని దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రెల్లికుల సభ్యులు గండి లక్ష్మి, సొండి శంకరరావు, న్యాయవాది చైతన్య, పాలకొండ రాజశేఖరు, కోలా రాజు, నిమ్మకాయల సుందరరావు, దేవుపల్లి సోకు, దాసు తదితరులు పాల్గొన్నారు.

నిర్విఘ్నం.. ఆటల యజ్ఞం!

అంతర్జాతీయ ఆటల పోటీల్లో అమెరికా, చైనా, జపాన్ తదితర దేశాలు దశాబ్దాలుగా పతకాల పట్టికలో ఆధిపత్యం సాధిస్తూ వస్తున్నాయి. దీనికి ఆయా దేశాలు అందిస్తున్న క్రీడా ప్రోత్సాహం.. క్రీడా అవకాశాలు.. క్రీడాకారుల కఠోర సాధనే కారణం. అదే స్ఫూర్తితో ఏపీ ప్రభుత్వం ఆటల యజ్ఞాన్ని ఆరంభించింది. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు 47 రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించి.. మట్టిలో మాణిక్యాలను వెలికితీసే క్రతువును నిర్విఘ్నంగా కొనసాగిస్తోంది.

- ఊరూరా ఆటల సంబరం
- ఉత్సాహంగా పాల్గొంటున్న యువతీయువకులు
- క్రీడాస్ఫూర్తితో రాణింపు


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

విజయనగరం డెస్క్: ఏదైనా ఒక రంగంలో రాణించాలంటే చక్కని ప్రణాళిక కావాలి. దాని అమలుకు అవసరమైన అవకాశాలు సృష్టించాలి. పటిష్ట కార్యాచరణ ప్రణాళికతో... భవిష్యత్తును అంచనా వేస్తూ ముందుకు సాగాలి. అప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ దిశగానే పయనిస్తోంది. ఏ రంగాన్ని తీసుకున్నా స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామికం, పర్యాటకం, క్రీడలు ఇలా అన్ని రంగాల్లోనూ పురోగతి సాధిస్తోంది. దీనికోసం పటిష్టప్రణాళికలు వేస్తూ నిరంతరం శ్రమిస్తోంది. మన విద్యార్థులు అంతర్జాతీయ విద్యా, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా ఇప్పటికే ఒకటో తరగతి నుంచి ఆంగ్ల విద్యావిధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు క్రీడల్లో ప్రోత్సహిస్తోంది.

పోటీలు సాగుతున్నాయి ఇలా...			
జిల్లా	సచివాలయాలు	మైదానాలు	క్రీడాకారులు
విజయనగరం	626	346	1.42లక్షల మంది
పార్వతీపురం మన్యం జిల్లా	350	139	65,905

సమస్తం సమకూర్చుతూ...

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉల్లాసంగా... ఉత్సాహంగా సాగుతున్నాయంటే దానివెనుక ప్రభుత్వ పరంగా స్పష్టమైన ఆదేశాలు... అధికార యంత్రాంగం కృషి కనిపిస్తోంది. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఐదు దశల్లో... ఐదు క్రీడాంశాల్లో 47 రోజుల పాటు సాగే ఆటల సంబరానికి క్రీడాకారుల పేర్లు నమోదు... రిఫరీల ఎంపిక... పీడీలు, పీఈటీల నియామకం... మైదానాలు సిద్ధం చేయడం.. క్రీడాకారులకు కావాల్సిన సమస్త ఆటసామగ్రి సమకూర్చడం... విజేతలకు బహుమతుల ప్రదానం... ఇలా... అన్నింటా ఎక్కడా రాజీపడకుండా పక్కాగా ఏర్పాట్లు చేసింది. దీనివెనుక ప్రభుత్వ లక్ష్యం ఒక్కటే.... క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడం... వారి ప్రతిభకు పదును పెట్టడం.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో మన రాష్ట్ర విద్యార్థులు పతకాల పంటపండిచేలా తీర్చిదిద్దడం... ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం. దీనికోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా విషం కక్కుతున్నా లక్ష్యసాధన కోసం నిరంతరాయంగా శ్రమిస్తోంది. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికార యంత్రాంగం క్రీడా యజ్ఞాన్ని ముందుకు సాగిస్తోంది. ఈ యజ్ఞంలో ప్రతిఒక్కరూ భాగస్వాములవుతున్నారు. ఊరి యువత ఆటల్లో తలపడుతుంటే చప్పట్లతో అభినందిస్తున్నారు. ప్రోత్సహిస్తున్నారు. ఫలానా వారి అబ్బాయి క్రీడల్లో రాణిస్తాడంగూ రచ్చబండలపై చర్చించుకుంటున్నారు. ఇప్పుడు ఏ ఊరిలో చూసినా ఆటల పండగే కనిపిస్తోంది.


ప్రభుత్వం సరఫరా చేసిన ఆట పరికరాలు

విజేతలకు బహుమతుల ప్రదానం ఇలా...

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లోని విజేతలకు ప్రభుత్వం బహుమతులు అందజేయనుంది. నియోజకవర్గ స్థాయిలోని విజేతలకు వరుసగా రూ.35వేలు, రూ.15వేలు, రూ.5వేలు, జిల్లా స్థాయి విజేతలకు వరుసగా రూ.60వేలు, రూ.30వేలు, రూ.10వేలు, రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన వారికి రూ.5లక్షలు, రూ.3లక్షలు, రూ.2లక్షలు అందజేయనుంది. బ్యాడ్మింటన్ విభాగంలో విజేతలకు నియోజకవర్గ స్థాయిలో మొదటి ముగ్గురికి రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, జిల్లా స్థాయి విజేతలకు రూ.35వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రాష్ట్రస్థాయి విజేతలకు వరుసగా రూ.2లక్షలు, రూ.లక్ష, రూ.50వేలు చొప్పున నగదు బహుమతులు అందజేయనుంది.



విజేతలకు అందజేసేందుకు సిద్ధంచేసిన ట్రోఫీలు

యువతలో స్ఫూర్తినింపుతున్న బ్రాండ్ అంబాసిడర్లు

పోటీలకు జిల్లా స్థాయి అంబాసిడర్లుగా నియమితులైన కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ పతక విజేత మత్స్యసంతోషి, జాతీయ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి శ్రీలక్ష్మి, స్కేటింగ్ క్రీడాకారుడు సాయితేజ తదితరులు క్రీడాకారుల్లో ఉత్సాహం నింపుతున్నారు. ఆటల్లో రాణిస్తే కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

ఆడుదాం–ఆంధ్రా పోటీలు సచివాలయ వేదికగా ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగుతున్నాయి. క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. గ్రామీణ ప్రజలు క్రీడామైదానాల వద్దకు వచ్చి ఆటలను తిలకిస్తున్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. ఏ ఊరిలో చూసినా ఆటల సంబరమే కనిపిస్తోంది. ఇది మంచి ఆరోగ్యకర వాతావరణం. యువతలో క్రీడావికాసం పెంపొందుతోంది. వచ్చేఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు పోటీలు సాగనున్నాయి. – బి.రామ్‌గోపాల్, సీఈఓ, సెట్విజ్

క్లుప్తంగా

పోలిపల్లి పైడితల్లి హుండీల ఆదాయం రూ. 2.50 లక్షలు


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 136 రోజులకు రూ.2,50,782లు సమకూరిందని ఈఓ బి.వి.మాధవరావు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పీవీ లక్ష్మి సమక్షంలో సాగిన హుండీల ఆదాయం లెక్కింపులో ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గరివిడి విద్యార్థి


జి.వాసు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో సెకెండ్ ఇయర్ బీఎస్సీ చదువుతున్న జి.వాసు జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీల్లో 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో ప్రథమ స్థానం సాధించి జనవరి 4 నుంచి 7వ తేదీవరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. విద్యార్థిని కళాశాల అధ్యాపక సిబ్బంది అభినందించారు.

జాతీయ పోటీల్లో రాజేశ్వరి సత్తా


తాను సాధించిన పతకాన్ని చూపిస్తున్న క్రీడాకారిణి రాజేశ్వరి

నెల్లిమర్ల రూరల్: జాతీయ స్థాయి పోటీల్లో మండలంలోని కొండవెలగాడకు చెందిన క్రీడాకారిణి బి.రాజేశ్వరి సత్తాచాటింది. ఈ నెల 28వ తేదీ నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీలో జరుగుతున్న ఐడబ్ల్యూఎల్‌ఎఫ్ జాతీయ స్థాయి యూత్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 40 కేజీల విభాగంలో ఈమె పాల్గొని, స్నాచ్‌లో 64 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 144 కిలోల బరువును ఎత్తి, కాంస్య పతకం దక్కించుకుంది. ఈ మేరకు ఆమెను జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

నా భర్త మృతదేహాన్ని అప్పగించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎర్నమ్మ, ఆమె కూతుళ్లు


బంగారునాయుడు(ఫైల్)

జామి: నా భర్త మృతదేహం అప్పగించాలని విజ్ఞప్తి చేస్తూ మృతుడు కొత్తలి బంగారునాయుడు భార్య ఎర్నమ్మ కలెక్టర్, తహసీల్దార్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఉపాధి కోసం కొంతమందితో కలిసి నవంబర్ 21వ తేదీన దుబాయి వెళ్లిన తన భర్త చనిపోయాడని తన భర్తతో పాటు దుబాయి వెళ్లిన సీహెచ్ మహాలక్ష్మి అనే మహిళ ఈ నెల 29వ తేదీన ఫోన్ చేసి, చెప్పిందని, ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త మృతి వార్తతో తామంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యామని, వేదన చెందుతున్నామని వాపోయారు. అక్కడి వారికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ కలవడం లేదన్నారు. అధికారులు స్పందించి, ఎలాగైనా తన భర్త మృతదేహం గ్రామానికి తెప్పించాలని ఆమె కోరారు.

పీవీటీజీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ప్రతినిధి శ్రీనివాస్ శాంఫే


గిరిజనులతో సమావేశమై, పీఎం జన్‌మన్ పథకంపై అవగాహన కల్పిస్తున్న కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ప్రతినిధి శ్రీనివాస్ శాంఫే

సీతంపేట: పీవీటీజీ(పర్టిక్యులర్ వాలనరబుల్ ట్రైబ్ గ్రూప్) గ్రామాలు, అక్కడి గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి శ్రీనివాస్ శాంఫే అన్నారు. శనివారం మండలంలోని వెదులవలస గ్రామాన్ని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ మల్లిఖార్జునరెడ్డితో కలిసి సందర్శించిన ఆయన పీఎం(ప్రధానమంత్రి) జన్‌మన్ పథకం ద్వారా పీవీటీజీ గ్రామాలకు తాగునీరు, రోడ్లు, గృహాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణానికి ఒక్కో కుటుంబానికి రూ.2.30 లక్షలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దీనికోసం సర్వే జరుగుతోంద ని, గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, ఎంపీడీవో గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటరు జాబితా రూపొందించాలి

- అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఉండాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి


మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

విజయనగరం అర్బన్: కచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఆర్‌వోలు, ఈఆర్‌వోలు, సెక్టోరల్ అధికారులతో సమావేశమైన ఆమె సెక్టోరల్ అధికారులు, ఏఈఆర్‌వోలంతా ప్రతీ పోలింగ్‌స్టేషన్‌ను సందర్శించి, అక్కడి మౌలిక సదుపాయాలు ఉన్నవీ లేనివీ పరిశీలించి, జనవరి 4వ తేదీ నాటికి ఆన్‌లైన్‌లో నివేదిక సమర్పించాలన్నారు. దీంతో ఏ పోలింగ్‌స్టేషన్‌లో ఎంతమేర వసతులు ఉన్నాయో తెలుసుకుని, ఏమేమి కావాలో సమకూర్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇదే నివేదికను ఎన్నికల కమిషన్‌కు కూడా పంపడం జరుగుతుందని, పూర్తి పరిశీలనానంతరం అసలైన నివేదిక అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతీ పోలింగ్‌స్టేషన్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంప్‌లు, లైట్లు వంటి సదుపాయాలు ఉన్నాయా లేదా అనే విషయం చూడాలన్నారు. 80 శాతానికి పైగా పోలింగ్‌స్టేషన్లు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నందున సదుపాయాల కల్పనకు అవసరమయ్యే నిధులను పాఠశాల నిర్వహణ నిధుల నుంచి ఖర్చు చేయాలని సూచించారు. ఇదే విషయంపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ అనుమతులు తీసుకోవాలన్నారు. ఇవన్నీ జనవరి 20వ తేదీలోగా పూర్తిచేసి, నివేదిక అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రైవేట్ భవనాల్లో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై ఆయా భవనాల యజమానులతో మాట్లాడి, ఏర్పాటు చేయించాలన్నారు. క్లెయిమ్స్, అభ్యంతరాల డిస్పోజల్‌కు గడువు పెంచినందున పెండింగ్ దరఖాస్తులన్నింటినీ 10 రోజుల్లోగా పూర్తిచేయాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఫైనల్ పబ్లికేషన్ కోసం ఎదురు చూస్తున్నాయని, అందరి ఫిర్యాదుల దరఖాస్తులను మరోసారి పరిశీలించి, పరిష్కరించాలన్నారు. శతశాతం తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందేలా కృషి చేయాలన్నారు. మృతి చెందిన ఓటర్లు, డబుల్ ఎంట్రీలను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌వో ఎస్.డి.అనిత, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, దొర, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పథకాలపై టీడీపీ నేత ప్రశంసలు


భామిని: ఎమ్మెల్యే కళావతిని ఇంట్లోకి ఆహ్వానించి మరీ హారతి ఇస్తున్న టీడీపీ నేత పాపినాయుడు, ఆయన కుటుంబ సభ్యులు

భామిని: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న పథకాలపై మండలంలోని తాలాడ టీడీపీ నాయకుడు వలరౌతు పాపినాయుడు ప్రశంసల వర్షం కురిపించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామానికి విచ్చేసిన విశ్వాసరాయి కళావతికి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో పాటు సదరు టీడీపీ నేత, ఆయన కుటుంబ సభ్యులు కూడా కూడా ఘనస్వాగతం పలకడం విశేషం. తమ ఇళ్లకు ఎమ్మెల్యేను, వైఎస్సార్ సీపీ నాయకులను ఆహ్వానించి మరీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనను మనసారా పొగిడారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలతో అందరికీ న్యాయం జరుగుతోందన్నారు. అన్నివర్గాల ప్రజలను సంతృప్తిపరిచేలా సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలు ఉన్నాయని, ఆయన హయాంలో ఎంతోమంది పేదలకు లబ్ధి జరుగుతుండడం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, నాయకులు ఎరుకుమజ్జి ప్రభావతి, ఎరుకుమజ్జి పాపినాయుడు, టింగ అన్నాజీరావు, బోనగడ్డి ధర్మారావు, మేడిబోయిన చలపతి, రొక్కం రామారావు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!


టాస్ వేసి, మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల పక్కనే జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

- విజయనగరం కింగ్స్, పార్వతీపురం పయనీర్స్ మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్
- పాల్గొన్న ఇరు జిల్లాల పోలీస్ అధికారులు
- విజేతగా నిలిచిన పార్వతీపురం పయనీర్స్ జట్టు
- మ్యాచ్‌ను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని విజయనగరం కింగ్స్, పార్వతీపురం పయనీర్స్ మధ్య శనివారం జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆద్యంతం ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు టాస్ వేసి, మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ నిరంతరం విధులు నిర్వహిస్తూ, ఎంతో ఒత్తిడికి గురయ్యే పోలీసులు ఉపశమనం పొందేందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలు మంచి ఆలోచన చేశారన్నారు. ఈ మ్యాచ్‌తో పోలీస్ అధికారుల్లో ఉత్సాహాన్ని, క్రీడాస్ఫూర్తిని నింపారన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలోనూ, నేరాలు నిరోధించడంలోనూ ఎస్పీ కృషి అభినందనీయమన్నారు. పోలీస్ సిబ్బంది ఫిట్‌నెస్ మెరుగుపర్చేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రభుత్వం కూడా గ్రామస్థాయిలో క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమం పేరిట క్రీడాపోటీలు నిర్వహిస్తోందన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏడాదికాలంగా ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహించి, కొత్త ఉత్సాహంతో నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న పోలీస్ అధికారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపేందుకు రెండు జిల్లాల ఎస్పీలు సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ముగింపు వేడుకల్లో ఇరుజిల్లాల ఎస్పీలు ఎం.దీపిక, విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కొత్త సంవత్సరానికి ముందు ఇరుజిల్లాల పోలీస్ అధికారుల్లో ఈ క్రికెట్ మ్యాచ్ మంచి ఉత్సాహాన్ని నింపిందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో సమష్టిగా పనిచేసి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విజయనగరం కింగ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 147 పరుగులు చేసింది. ఎస్ఐ నవీన్ పడాల్ 58(44) పరుగులు, ఎస్ఐ నాయుడు 16 పరుగులు చేశారు. 148 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన పార్వతీపురం పయనీర్స్ జట్టు 18.1 ఓవర్లలో కేవలం 3 వికెట్లు కోల్పోయి లక్ష్య ఛేదన చేసి, విజేతగా నిలిచింది. అనంతరం విజేత జట్టుకు ట్రోఫీ బహూకరించారు. ఎస్ఐ అనిష్ 50 పరుగులు, ఎస్ఐ అజయ్ 45 పరుగులు, ఎస్పీ విక్రాంత్ పాటిల్ 22 పరుగులు చేసి, జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. మూడు వికెట్లతో పాటు 50 పరుగులు చేసిన ఎస్ఐ అనిష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకోగా, బెస్ట్ బ్యాటర్‌గా ఎస్ఐ నవీన్‌పడాల్, బెస్ట్ బౌలర్‌గా సీఐ వెంకటరావు, బెస్ట్ ఫీల్డర్‌గా ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, బెస్ట్ క్యాచర్‌గా ఎస్ఐ షణ్ముఖరావు ఎంపికయ్యారు. మ్యాచ్‌లో పార్వతీపురం అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, ఏఎస్పీ సునీల్ షరోన్, పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు, ట్రైనీ డీఎస్పీ మహ్మద్ షేక్ అజీజ్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ దీపిక

ఆరోగ్యానికి వ్యాయామం చాలా అవసరం

- సెంచూరియన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి


మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి

నెల్లిమర్ల రూరల్: ఆరోగ్యానికి వ్యాయామం చాలా అవసరమని, ప్రతిఒక్కరూ ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసి ఆరోగ్యం కాపాడుకోవాలని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ(వైస్ చాన్సలర్) ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో కార్డియోపల్మనరీపై శనివారం అవగాహన కల్పించారు. ప్రతిరోజూ మనం చేసే వ్యాయామంతో ఊపిరితిత్తులతో పాటు మన శరీరంలోని మరికొన్ని ప్రధాన అవయవాలను ఆరోగ్యంగా ఉంచుకోగలమన్నారు. మనం తీసుకునే రోజువారీ ఆహారంలో పౌష్టికాహారం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. పారామెడికల్ విద్యార్థులతా ప్రాథమిక చికిత్సలో నైపుణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు చైతన్య, శ్రీలక్ష్మి, డీన్‌లు రమణారావు, సన్నిడియోల్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం వ్యక్తిగత కార్యదర్శిని కలిసిన న్యాయవాదుల సంఘాల ప్రతినిధులు


ధనుంజయ్‌రెడ్డిని కలిసిన వివిధ జిల్లాల న్యాయవాదుల సంఘాల ప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డిని రాష్ట్రంలోని 13 జిల్లాల న్యాయవాదుల సంఘాల ప్రతినిధులు విజయవాడలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారు భూ హక్కుచట్టం రద్దు చేయాలని కోరుతూ ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో 15 వేల ఎకరాల్లో సమగ్ర సర్వే చేయాల్సి ఉందని, దీనికి కొంతసమయం పడుతుందని ధనుంజయ్‌రెడ్డి తెలిపినట్టు విజయనగరం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చొక్కాపు దాము తెలిపారు. ఈ చట్టం రాష్ట్రంలో ఇంకా అమల్లోకి రాలేదని, అప్పుడే దీనికి వ్యతిరేకంగా నిరసనలు చేయడం తగదని ఆయన అన్నారన్నారు. మేధావుల సలహాలు, సూచనల తీసుకున్న తర్వాత దీనిపై ప్రభుత్వం ఓ ప్రకటన చేస్తుందని, అంతవరకు ఓపిగ్గా ఉండాలని ఆయన తెలిపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విశాఖ న్యాయసేవా సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, విజయవాడ న్యాయవాద సంఘ ప్రతినిధి సుందర్, శ్రీకాకుళం న్యాయవాద సంఘం అధ్యక్షుడు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.